క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



డిపాజిట్ బాండ్ అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో బత్తిని శ్రీకాంత్‌గౌడ్ అనే యువకుడు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి రూ. 1 లక్ష ఆర్థికసాయం శనివారం అందించారు. మృతుడు శ్రీకాంత్‌గౌడ్‌కు ఐదేళ్ల లోపు వయస్సు గల కూతురు, కుమారుడు ఉండటంతో వారి పేరిట డిపాజిట్ చేసి బాండ్‌ను అందించారు. నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం పట్ల గీతకార్మిక సంఘం ప్రతినిధి బత్తిని మోహన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, పుర్కుటపు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రిటర్నింగ్, ప్రిసైడింగ్, ఎన్నికల కమిషనర్, పోలింగ్ ఏజెంట్లుగా విద్యార్థులు వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



సమీర్



లక్ష్మీశశాంక్

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సమీర్ అథ్లెటిక్స్ సీనియర్ విభాగం ట్రిపుల్ జంప్‌లో, జూనియర్ విభాగంలో లక్ష్మీ శశాంక్ మొదటి స్థానంలో నిలిచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ బందెల శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, విజేతలను హెచ్‌ఎం రమణి, సర్పంచ్ చంద్రశేఖర్‌రావు, విద్యాకమిటీ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

టవర్ ఎక్కిన యువకుడు



శివతో మాట్లాడుతున్న కౌన్సిలర్ సాయికుమార్

రాయికల్: తన ఇంటి నిర్మాణానికి సహకరించాలని డిమాండ్ చేస్తూ.. రాయికల్‌కు చెందిన శివ అనే వ్యక్తి శనివారం పట్టణంలోని సెల్ టవర్ ఎక్కాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని.. కౌన్సిలర్ సాయికుమార్ సహాయంతో శివతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శివ కిందకు దిగి వచ్చాడు.

కేసు నమోదు

సెల్ టవర్ ఎక్కిన గోగుల శివపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ శనివారం తెలిపారు. సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ, ప్రజా శాంతికి భంగం కలిగించినందుకు కేసు నమోదు చెసిన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల: సారంగాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన అంజలి శుక్రవారం అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్ శనివారం పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం నుంచి కల్పించిన అంత్యక్రియలకు సంబంధించిన రూ.20 వేలు ఇంటికి వెళ్లి అందజేశారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శైలజ, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ మధు, జాన్సన్, నరేశ్, ఆయాలు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి



చల్మెడ లక్ష్మీ నర్సింహారావును సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: గీత కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మల్కపేటలో ఏర్పాటు చేసిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతి వృత్తుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

మండలం శివంగాలపల్లి, పల్లిమక్త గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. నాగారంలో మాజీ మావోయిస్ట్ నేరెళ్ల జ్యోతి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నిర్వహించారు.

చల్మెడ సతీమణి ప్రచారం

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు సతీమణి సునీల శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలని బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థించారు.

మేడిపల్లిలో తుల ఉమ..

మేడిపల్లి : మండల కేంద్రంలో వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహా రావుకు మద్దతుగా తుల ఉమ ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. శనివారం వెంకట్రావుపేట, రాగోజీపేట, ఒడ్యాడ్, కమ్మరిపేట, భీమారం, ఈదులలింగంపేట, కొండాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అంగడి ఆనంద్, శ్రీ పాల్ రెడ్డి, తన్నీరు శ్రీనివాస్ రావు, కడతల వెంకటేశ్, బూస రాకేశ్, ఉదిగిరి ఆదిరెడ్డి, నాంపెల్లి నర్సయ్య, ఉరుమట్ల చిన్నరాజం, మంతెన రాజేందర్, సూర మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కమ్మరిపేట, భీమారం గ్రామాలకు చెందిన పలువురు యువకులు చల్మెడ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. దాసరి నాగరాజు, కొటగిరి రాజశేఖర్, పరమేశ్వర్ రావు, తదితరులున్నారు.



మేడిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న తుల ఉమ

అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ

- కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం

రామడుగు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. దేశరాజ్‌పల్లి, మోతె, రుద్రారం, రంగసాయిపల్లి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, గుండి, రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, శ్రీరాములపల్లి, తిర్మలాపూర్, రామడుగు, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల్లో శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచారని ఆరోపించారు. మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, ఉప్పుల అంజనీ ప్రసాద్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, కోల రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ

చొప్పదండి: కాట్నపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ కట్టెకోల తార, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కట్టెకోల లక్ష్మణ్, టీఆర్‌ఎస్‌నాయకులు భక్తు కుమార్, బండారి స్వామి శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లి, తడగొండ, మల్కాపూర్ తదితర గ్రామాల్లో చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యంకు మద్దతుగా శనివారం కాంగ్రెస్ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



దేశరాజ్‌పల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న మేడిపల్లి సత్యం

చిత్ర కథ: ప్రమాదకరంగా భారీ గుంత



మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామశివారులోని వంతెనపై భారీ గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముత్యంపేట నుంచి కొండగట్టుకు వెళ్లే దారిలో వరదకాలువపై ఉన్న వంతెనపై నుంచి నిత్యం భారీ టిప్పర్లు వెళ్తుండడంతో గుంత పడి, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ వాహనదారులు గుంతలో నుంచి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి, తక్షణమే గుంత పూడ్చి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు



రాజారాం తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి(వేములవాడ): నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని అనంతపల్లి, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనుల్లో సగానికిపైగా కేంద్ర ప్రభుత్వ నిధులేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, అసెంబ్లీ నియోజక కన్వీనర్ మార్త సత్తయ్య , పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లో వచ్చానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని కనగర్తి, నిజామాబాద్, వెంకట్రావుపేట, కొండాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కొన్నేళ్లుగా స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మండలాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సర్పంచ్ అనుపాటి భారతి, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, రావులపెల్లి గంగారెడ్డి, పోగుల లచ్చిరెడ్డి, నాయిని రాంరెడ్డి, బాలకిషన్, శ్రీనివాస్‌రెడ్డి, మ్యాకల భూమయ్య, మిర్యాల్‌కార్ బాలాజీ, తిరుపతిగౌడ్, రవీందర్‌రావు, పురుషోత్తం రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ నాయకులు ప్రచారం

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, భూషణరావుపేట, రాజారాం తండా గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావుకు మద్దతుగా నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఓటర్లకు ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, గాంధారి శ్రీనివాస్, పల్లె గంగాధర్, మారుతి, ప్రతాప్, వెంకటేశ్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమావేశం

పెగడపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి ఎంపీఓ ఫరూక్ శనివారం సమావేశమయ్యారు. ఓటరు జాబితా పరిశీలన, మృతి చెందిన ఓటర్ల ఏరివేత, డబుల్ ఓటర్లు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సెక్టోరియల్ అధికారులు మహేందర్, ఆదిత్య, హరిబాబు, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆర్తై శ్రీనివాస్ పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

మెట్‌పల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి కోరారు. మారిన వాతావరణ పరిస్థితులతో వర్షాలు కురిసే అవకాశముండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి కేంద్రంలో టార్పాలిన్లను అందుబాటులో ఉంచి, కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు.

పేదవారికి దుప్పట్లు పంపిణీ

జగిత్యాల: పట్టణంలోని పార్వతి పరమేశ్వర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలం దృష్ట్యా నిరుపేదలకు దుప్పట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలంలో పేదలు ఇబ్బందులకు పడుతున్నారని, ప్రతి ఒక్కరికీ దుప్పట్లు అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరు ఓటేయ్యాలి

జగిత్యాల: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు వజ్రాయుధమని, ఓటుతోనే మంచి నాయకుడిని ఎన్నుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, బాలు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



ధరూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/రాయికల్/సారంగాపూర్: నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులు, నిరుపేదలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. రాయికల్ పట్టణంలోని కుల సంఘాలతో శనివారం సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని మోసం చేయడంతో పాటు, నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూంలు, జీవనభృతి, దళితులకు మూడెకరాల స్థలం అమలు చేస్తామని మోసం చేశారన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

‘పద్మశాలీల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారు’



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

కోరుట్ల: పద్మశాలీ సామాజిక వర్గానికి కోరుట్ల అసెంబ్లీ సీటు కేటాయిస్తామని చెప్పి మోసగించిన కోరుట్ల బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ పద్మశాలీ నాయకులను చిన్నచూపు చూస్తున్నారని అఖిల భారత పద్మశాలీ సంఘం రాజకీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్, పద్మశాలీ యువజన సంఘం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్ ఆరోపించారు. శనివారం వారు మాట్లాడుతూ, బీజేపీ చేస్తున్న మోసాన్ని గుర్తించి పద్మశాలీ నేతలు సాంబారి ప్రభాకర్, చాట్ల గణేశ్, దాసరి రాజశేఖర్, జక్కుల ప్రసాద్, కౌన్సిలర్లు దాసరి సునీత పార్టీకి రాజీనామా చేశాన్నారు. సభలు, సమావేశాల్లో పద్మశాలీలను అవమానించడం సరికాదన్నారు. 68 వేల ఓట్లు ఉన్న పద్మశాలీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత దక్కకపోతే ఊరుకోమన్నారు. గతంలో బుగ్గారం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా గంగుల భూమయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకున్న చరిత్ర పద్మశాలీలకు ఉందని వారు గుర్తు చేశారు. పద్మశాలీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న అర్వింద్ వైఖరికి నిరసన చాలా మంది పద్మశాలీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారన్నారు. త్వరలో పద్మశాలీలను అవమానపర్చిన బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

అభివృద్ధిని చూసి.. ఆశీర్వదించండి



మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని వెన్గుమట్ల, గోవిందుపల్లి, చిల్వకోడూర్, దట్నూర్, చందోలి, భీంరాజ్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. తెలంగాణ వచ్చాక బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాలకు అండగా ఉంటూ ప్రతీ సమస్యను పరిష్కరిస్తున్నామని, ఇది పేద ప్రజల పక్షపాతి ప్రభుత్వమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో ప్రతి ఇంట్లో లబ్ధిదారులున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ నక్క శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

ధర్మపురి: పట్టణంలోని ఒడ్డెర కాలనీ, ఆకసాయిపల్లె, పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, ధర్మారం మండలం నందిమేడారం గ్రామాలకు చెందిన పలువురు పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ హయంలో జరిగిన అభివృద్ధికి ఆకర్శితులపై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి గెలుపు కోసం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలువురు ముడుపు కట్టారు.

ఆడబిడ్డలారా.. ఆశీర్వదించండి

- ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



బుగ్గారంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: ‘ఆడబిడ్డలారా.. నన్ను ఆశీర్వదించండి. మీ దీవెనలే నా గెలుపునకు మంత్రం నాలుగు సార్లు ఓడిపోయిన నన్ను మీ ఆశీస్సులతోనే విజయ తీరాలకు చేర్చాలి’ అని కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుగ్గారంలో మహిళలతో భావోద్వేగపూరితంగా మాట్లాడారు. ప్రస్తుత అధికార పార్టీని తట్టుకునే శక్తి తనకు లేదని, ప్రతి ఒక్కరూ తనను ఆశీర్వదించాలని కోరారు. అడ్లూరి ప్రసంగం సందర్భంగా పలువురు మహిళలు కంటతడి పెట్టారు.

పెగడపల్లి: సోనియా గాంధీ ప్రకటించిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల్లో నుంచి విశేష స్పందన లభిస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ గజ్జల స్వామి అన్నారు. నందగిరిలో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మన్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

గ్యారంటి పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

ధర్మపురి: కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘం భవనంలో శనివారం మహిళలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అవ్వా 3 సార్లు ఓడిపోయినా.. మీ వెంటే ఉన్నానని, రానున్న ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని మహిళలను వేడుకున్నారు. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాల సందర్శించిన కేరళ విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని వెటర్నరీ కళాశాలను శనివారం కేరళ హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. వెటర్నరీ కళాశాలలో పశువులు, జంతువుల పెంపు కోసం చేపడుతున్న చర్యలు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర అంశాలను విద్యార్థులు పరిశీలించారు. పశువులు, జంతువులను పలు రకాల వ్యాధులు సోకినప్పుడు వాటికి ఏలా చికిత్స అందిస్తారన్న అంశంలో పరిశీలించారు. వెటర్నరీ వైద్య విద్యను అభ్యసిస్తే కలిగే లాభాలపై కళాశాల డీన్ మాధవరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ ఎంఏ. భారీ, ప్రిన్సిపాల్ సెలినా భారీ, చైర్మన్ ఎంఏ. హాదీ ఉన్నారు.



వెటర్నరీ కళాశాలలో కేరళ విద్యార్థులు